తగ్గని నీటి ప్రవాహం



కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండంలో ఉధృతంగా ప్రవాహిస్తున్న పెద్ద వాగు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న పెద్ద వాగు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవాహిస్తోంది. దీంతో ముక్కిడిగుండం, గేమ్యానాయక్ తండా, చెంచు గూడెలకు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు పనులు వాయిదా వేసుకున్నారు. పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. పాలకులు స్పందించి త్వరగా వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పాపగల్ దగ్గర దుందుభీనది నిలిచిన రాకపోకలు

తాడూరు: మండలంలోని పాపగల్, శిర్సవాడ, ఆకునెల్లికుదురు, ఎట్టిదారిపల్లి, మేడిపూర్, పాల్మూరు, గుట్టలపల్లి గ్రామాలను అనుసరించి పారుతున్న దుందుభీనది వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నీటి ఉధృతి పెరిగింది. శిర్సవాడ దగ్గర రాకపోకలను నిలిపివేశారు. వాగులోకి వెళ్లొద్దని అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. వర్షాలు తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్అలీ, ఎంపీడీఓ బ్రహ్మాచారీలు కోరారు. ప్రజలు ఎవరు బయటకు రావొద్దని తెలిపారు.

క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల: మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్య సమావేశం(మహాజన సభ) గురువారం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు విధిగా పాల్గొనాలని కోరారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఉప్పునుంతల: కారుణ్య నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ మండలంలో ఉన్న వీఆర్ఏల వారసులు బుధవారం స్థానిక తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో మొత్తం 3797 మంది వీఆర్ఏలు 61 ఏళ్లు పైబడిన వారు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం 2023లో విడుదల చేసిన జీఓ నంబర్ 81, 85ల ప్రకారం 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చిన్నయ్య, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

మన్ననూర్: అర్హులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని బీజేవైఎం యువమోర్చా మండల నాయకుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో రైతులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. ఇంకా 50 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. అదేవిధంగా అకాల వర్షాలు, తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులు సుక్య, లచ్చు, చంద్రు పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు



కొల్లాపూర్: విద్యాశాఖపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు డి.శేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడంతో విద్యారంగ సమస్యలు పేరుకుపోతున్నాయని వాపోయారు. డీఎస్సీ ఫలితాలపై కాలయాపన చేయడం తగదన్నారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో పాఠశాలల్లో మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్, గురుకులాల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల కొరత, ఎంఈఓల నియామకాల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమావేశంలో నాయకులు ఫైజ్, వెంకట్, రాము తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



నాగర్‌కర్నూల్‌రూరల్: సీపీఎం మహాసభల వాల్‌పోస్టర్‌ను బుధవారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందికొండ గీత విడుదల చేశారు. జిల్లా కేంద్రంలో అక్టోబర్ 5, 6 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి అశోక్, రామయ్య, సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి: మున్సిపాలిటీ పరిధిలోని సంజాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

లింగాల: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన తాగునీటి సరఫరా సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు రెండో రోజు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా చేతి పంపుల మరమ్మతుపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ ఆంజనేయులు వాటర్‌మేన్లకు నీటి సరఫరా విషయంలో తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి రోజు గ్రామాలలో నీటిని సకాలంలో సరఫరా చేయాలని సూచించారు. నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్, చేతి పంపుల వాడకం, మరమ్మతు, పైపులైన్ల నిర్వహణ, లీకేజీలను సరి చూసుకోవడం తదితర మైనర్ పనులను వాటర్ మెన్లు చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శిక్షకులు ధర్మారెడ్డి, మిషన్ భగీరథ ఏఈ బాల్‌రాంనాయక్, మండలంలోని ఆయా గ్రామాల వాటర్ మెన్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీఓ దమయంతి

ఉప్పునుంతల: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి అన్నారు. బుధవారం స్థానిక రైతువేదికలో నిర్వహించిన స్థాయి పోషణమాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, పప్పు దినుసులు, కూరగాయలు పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. అనంతరం వెల్ బేబీ షో వైద్యాధికారిణి స్వప్న నిర్వహించారు. చిన్నారులు, కిషోర బాలికలకు పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌లాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాషా, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

చట్టం అందరికీ సమానమే



నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): చట్టం అందరికీ సమానమేనని జిల్లా జూనియర్ సివిల్ న్యాయమూర్తి పుట్ట మౌనిక అన్నారు. బుధవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మౌనిక మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌ను అతిగా వినియోగించొద్దన్నారు. చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఈ నెల 28న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, న్యాయవాదులు శ్యాంప్రసాద్‌రావు, రాంచందర్, భవాని, శ్రీరామ్ ఆర్య, అబ్దుల్ రహీం, ఖాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై స్వేరో ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే విధంగా అవగాహన కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్వేరో జిల్లా ప్రతినిధి బొల్లె రమేష్ అన్నారు. కార్యక్రమంలో రాము, భాస్కర్ పాల్గొన్నారు.

అర్థమయ్యేవిధంగా బోధన

వెల్దండ: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని సీఎంఓ వెంకటయ్య కోరారు. బుధవారం మండలంలోని కొట్ర ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎం ప్రేమకుమారి అధ్యక్షతన ఫిజికల్ సైన్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వెల్దండ, చారకొండ, కల్వకుర్తి, వంగూర్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షకులు వివిధ అంశాలను వివరించారు. భిన్న వ్యక్తిత్వాలు, భిన్న అభిప్రాయాలు, మానసిక ధోరణులు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని బోధించాలన్నారు. కార్యక్రమంలో షర్ఫుద్దీన్, పి. వెంకటయ్య, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

తాడూరులో..

తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో తరగతిగదిలో విద్యాబోధనపై సీఆర్పీ లక్ష్మణ్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను పాఠశాల గదిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు డీఎల్‌పీఓ రామ్మోహన్‌రావుకు ఫిర్యాదు అందజేశారు. బుధవారం స్థానిక ప్రైవేటు వ్యక్తుల ఆస్తి తగాదాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులో భాగంగా పరిశీలించేందుకు వచ్చిన ఆయనను కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు కలిశారు. నాయకులు రహీం, వెంకటేశ్వర్లు, సెవ్వ బాలు, గంగాజీ, సత్యనారాయణ, జాకీర్, రాజు, చంద్రు, తిరుపతి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



రోబోటిక్ తరగతులు ప్రారంభం



తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు బుధవారం రోబోటిక్ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ సోహమ్ అకాడమిక్ ఆధ్వర్యంలో రోబోటిక్ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రోగ్రాం తయారీ, సందేశాలు రూపొందించడంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనునట్లు తెలిపారు. హెచ్ఎం అనీల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్యం, శేఖర్, సోహమ్, అకాడమిక్ అధికారి జశ్వంత్, ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన మహేష్ ఏప్రిల్ నెలలో డ్రంకెన్‌డ్రైవ్ పట్టుబడగా కేసు నమోదు చేసుకొని బుధవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. అతడికి రెండు రోజుల జైలుతో పాటు రూ. 500 జరిమానా విధించినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: తూడుకుర్తి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటనలో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. యువతి శ్రీలేఖ మంగళవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో ఎంత వెతికినా ఆచూకీ తెలువలేదు. దీంతో బాధిత కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చౌకధర దుకాణంపై విచారణ

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో చౌకధరల దుకాణం నిర్వాహణపై జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాసులు బుధవారం విచారణ నిర్వహించారు. డీలర్ సమీప బంధువుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు అధికారి తెలిపారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూన నిరంజన్

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): తెలంగాణ మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూన నిరంజన్‌ని నియమిస్తూ రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి బుధవారం నియామక పత్రం అందజేశాడు. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు.

స్వచ్ఛతపై అవగాహన

చారకొండ: మండల కేంద్రంలో బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్లు, ప్రధాన వీధులను ఊడ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులకు పీహెచ్‌సీలో వైద్యాధికారి మంజుభార్గవి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీఓ వెంకటేష్, సీహెచ్ఓ శేఖర్ రెడ్డి, ఎన్‌డీవీ చారి, కార్యదర్శి గణేష్, కార్మికులు ఉన్నారు.

ప్లాస్టిక్ అనార్థాలపై

అమ్రాబాద్: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనార్థాలు, నష్టాలపై విద్యార్థులకు అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్య ప్రాణులు చనిపోయే ప్రమాదం, అడవుల నష్టంతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతాయని పబ్లిక్ రిలేషన్ అధికారిణి స్వేతా వివరించారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి

కొల్లాపూర్ రూరల్: పాలమూరు ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కేఎల్ఐ ప్రాజెక్టు నుంచి మొలచింతలపల్లి జిల్దార్ తిప్ప చెరువుకు సాగునీరు రావడానికి లిఫ్ట్ ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో వినతి పత్రం ఇచ్చారు. అదే విధంగా బోడబండ తండా, సున్నపుతండా, వడ్డెర గుడిసెలు, గ్రామాలకు చెందిన భూములు, ఇళ్లు పాలమూరు ప్రాజెక్టులో మునిగాయని ఇప్పటి వరకు నష్టపరిహారం రాలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ హనుమంతు నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఎంఈఓగా చంద్రుడు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ ఉన్నత పాఠశాలల్లో జీహెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న చంద్రుడు బుధవారం మండల ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పెంట్లవెల్లి, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి, లింగాల, వెల్దండ మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా వ్యవహరించారు.

పెద్దకొత్తపల్లి: మండల విద్యాధికారిగా కొత్త శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మండంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం పీఆర్‌టీయూ నాయకులు సన్మానించారు. మండల అధ్యక్షుడు బాబూరావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, పరమేశ్, సాయిప్రకాశ్‌రెడ్డి, శివుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, మహంకాళి, ప్రకాశ్, సుదర్శన్, శివశంకర్ పాల్గొన్నారు.

అలుగులో పడి రెండు మేకలు మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెన్నచర్ల గ్రామంలో పెద్ద చెరువు అలుగు ఉధృతికి రెండు మేకలు కొట్టుకుపోయి మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మేకల కాపరి లక్ష్మీకాంతానికి సంబంధించిన రెండు మేకలు మేత మేస్తుండగా ఉధృతంగా ప్రవహిస్తున్న అలుగులో పడి కొంతదూరం కొట్టుకుపోయి మృతిచెందాయి. రెండు మేకల విలువ రూ.30వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

హమాలీలకు పింఛన్ సౌకర్యం కల్పించాలి



పెద్దకొత్తపల్లి: లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ కోరారు. మండలంలోని కల్వకోలులో బుధవారం నిర్వహించిన హమాలీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమీలీల కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పైబడినవారికి పింఛన్ ఇవ్వాలని కోరారు. బాలస్వామి, వెంకటస్వామి, రాముడు, జంపయ్య, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి డిమాండ్ చేశారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం అమలుతో పాటు రాష్ట్ర అసెంబ్లీలో జనాభా ప్రతిపాదికన బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. జిల్లా నాయకులు చిన్నపాగ శ్రీనివాస్, బండి శ్రీను, బాబ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ ఉపాధ్యాయుల సమావేశం



అచ్చంపేట రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బహుజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల వెంకటేష్ కోరారు. బుధవారం అచ్చంపేటలో బీటీఏ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రాథమిక విద్య విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిలాంటిదన్నారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు రవీందర్, శ్రీనివాసులు, భూపతికుమార్, రంజిత్, నాగరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

తెలకపల్లి: బాల్య వివాహాలు అరికడదామని కోనేరు సంస్థ అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నముద్దునూరులో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తైన తర్వాత ఆడపిల్లలకు పెళ్లి చేయాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతునట్లు సమాచారం తెలిస్తే చైల్డ్ లైన్ 1098కి, 100కి సంబంధిత అధికారులకు తెలపాలని కోరారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన ఏఓ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు, ముక్కిడిగుండం గ్రామాల్లో బుధవారం వరి పంటలను మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తి పంటపై రైతులకు అవగాహన సదస్సు



కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగులలో పత్తి పంటపై బుధవారం సింధూరి సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో 666 బీ-2 సీడ్స్‌పై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. సదస్సుకు లింగసానిపల్లి, తుర్కలపల్లి, గుండూరు, ముకురాల, పంజుగులకు చెందిన 200 మంది రైతులు హాజరయ్యారు. సస్యరక్షణ చర్యలను వివరించారు. కంపెనీ ప్రతినిధి మల్లేష్, తిరుపతి, బాలకిష్టయ్య, జంగయ్యగౌడ్, రమేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగుదాం

కల్వకుర్తిరూరల్: ఐకమత్యంతో ముందుకు సాగుదామని సగర సంఘం జిల్లా కో కన్వీనర్ రాజు అన్నారు. బుధవారం నియోజకవర్గ సగర సంఘం సమావేశాన్ని పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువకులు అత్యధిక సంఖ్యలో పోటీ చేసేందుకు సిద్ధం కావాలన్నారు. నాగర్‌కర్నూల్‌లో అక్టోబర్ 6న జిల్లా కమిటీ సంఘం ఎన్నికలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకటయ్య, బాబు, వివేకానంద, భీమయ్య, వేణు, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రయ్య పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు అర్జున్‌గౌడ్, ఉపాధ్యాయులు ఆయనను పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో సుబ్బయ్య, మునీశ్వర్, నారాయణయాదవ్, చెన్నయ్య, రాజేష్, ఉదయ్‌భాస్కర్, లక్ష్మణ్‌నారాయణ, లక్ష్మీదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హైమాక్స్ లైట్లు ప్రారంభం

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో హైమాక్స్ లైట్లను కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణ బుధవారం ప్రారంభించారు. మంత్రి కృష్ణారావు హైమాక్స్ లైట్లను మంజూరు చేశారని తెలిపారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ పట్టణాధ్యక్షుడు నర్సింహ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, నరేష్‌గౌడ్, రవిగౌడ్, బాబీదేవ్, వివేకానంద పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత: కేసు నమోదు

చారకొండ: మండలంలోని మర్రిపల్లి సమీపాన ఉన్న వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మంగళవారం రాత్రి టిప్పర్ ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకొని టిప్పర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుధవారం టిప్పర్, సంబంధిత డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి



పెంట్లవెల్లి: మండలంలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు, సాగు భూములు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ బుధవారం తహసీల్దార్ వైజయంతికి వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని జటప్రోల్, పెంట్లవెల్లి, గోపులాపురం, ఎంగంపల్లితండా, సింగవరం, కొండూరు గ్రామాల ప్రజలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు పంచి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామలు నెరవేర్చాలని కోరారు. శ్రీనివాసులు, తిమ్మస్వామి, రాజు, ఆదిలక్ష్మి, ఖాదర్, రాంచంద్రయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

బల్మూర్: మండలంలోని చెన్నారంలో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ శిలాఫలాకాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ మల్లేష్‌సాగర్ డిమాండ్ చేశారు. గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఉద్దేశ్యంతో గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చొరవతో రెండు షెటర్లను నిర్మించి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈనెల 23న రాత్రి గుర్తు తెలియని దుండగులు శిలాఫలాకాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కల్వకుర్తిరూరల్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. బుధవారం పట్టణంలో డివిజన్ స్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా జర్నలిస్టులు ఇబ్బందులు పడ్డారన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు మంచి రోజులు రానున్నాయన్నారు. ఇళ్ల స్థలాలు, వైద్యం, విద్యా సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అనంతరం టీయూడబ్ల్యూజే 143 నుంచి పలువురు ఐజేయూ యూనియన్‌లో చేరారు. కర్ణయ్య, బచ్చు రామకృష్ణ, శ్యాంసుందర్, గుండూరు కృష్ణయ్య, సమ్మద్, బాలయ్య, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

6న సమావేశం

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతం అచ్చంపేటలో అక్టోబర్ 6న డివిజన్ స్థాయి టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సమావేశం నిర్వహించనునట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కర్ణయ్య, రాష్ట్ర, జిల్లా స్థాయి బాధ్యులు హాజరవుతారని తెలిపారు.

అధికార పార్టీ వేధింపులు భరించలేకపోతున్నా..

నాగర్‌కర్నూల్ క్రైం: అధికార పార్టీ నాయకుల వేధింపులు భరించలేకే ఊరు విడిచి వెళ్తున్నానని బీఆర్ఎస్‌కు చెందిన ఓ నాయకుడు సోషల్‌మీడియాలో వీడియో పోస్టు చేయడంతో బుధవారం వైరల్‌గా మారింది. మండలంలోని పెద్దముద్దునూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కురుమూర్తిపై గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒత్తిడితో ఈనెల 20న తనపై అకారణంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారని కురుమూర్తి ఆరోపించారు. ఈవిషయమై ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా కురుమూర్తి ఎక్కడికి వెళ్లలేదని తెలిపారు.